ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 30 జూలై 2024

సీఎంపై గవర్నర్‌కు ఫిర్యాదు

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల అవినీతిలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా సామాజిక కార్యకర్త అబ్రహాం రాజ్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ఫిర్యాదు చేశారు. సీఎంపై విచారణకు అనుమతి కోరుతూ సోమవారం సమగ్ర వివరాలను అందించా రు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాజ్‌భవన్ నుంచి నివేదిక కోరారు. 2011లో అప్పటి సీఎం యడియూరప్పపై న్యాయవాది సిరాజిన్ బాషా, కేఎస్ బాలరాజ్ ఫిర్యాదు చేయడంతో నాటి గవర్నర్ హెచ్‌ఆర్ భరద్వాజ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారు. దీంతో సీఎం యడియూరప్పను అరెస్టు చేశారు.

జనజీవనం అతలాకుతలం

- పోటెత్తుతున్న వరదలు
- బెళగావిలో 41 వంతెనలు మునక
- చిక్కోడి పరిధిలో గ్రామాలు వీడుతున్న ప్రజలు
- బాగల్కోటె జిల్లాలో జలమయమైన ముత్తూరు
- బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం


సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న గ్రామస్థులు


గోకాక్‌లోని భోజగరగల్లి ఇలా...

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాల ప్రభావం తగ్గుముఖం పట్టినా మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పొంగి పొర్లుతోంది. ఉత్తరకన్నడ జిల్లాలో పెను బీభత్సం చోటు చేసుకుంటోంది. పల్లెలను వీడి ప్రజలు ప్రాణాలు అరచేతపట్టుకుని పరుగులుదీస్తున్నారు. బెళగావి, బాగల్కోటె జిల్లాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. బెళగావి జిల్లాలో కృష్ణ, ఘటప్రభ, మలప్రభ, వేదగంగ, మార్కండేయ, హిరణ్యకేశి నదులకు వరద పోటెత్తుతోంది. జిల్లా పరిధిలో 41 వంతెనలు నీట మునిగాయి. ఈ పరిణామంతో చిక్కోడి జిల్లాలోని పలు గ్రామాలలో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలోని 38 గ్రామాలలో 2081 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చిక్కోడి తాలూకా యడూరు వీరభద్రేశ్వరస్వామి ఆలయం గర్భగుడి జలావృతమైంది. గోకాక్ తాలూకా అడబట్టి, హడిగనాళ, మళవంకి, ఉదగట్టి గ్రామాల పరిధిలో ఘటప్రభ నీటి ప్రభావం పెరుగుతుండడంతో ప్రజల పశుసంపదతోపాటు తరలుతున్నారు. మూడలగి తాలూకా మసగుప్పి, హుణశ్యాల, పిపై ధవళేశ్వర గ్రామాలకు నీరు చేరింది. దాదాపు 41 వంతెనలు మునిగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. ఎక్కడివారు అక్కడే గడిపే పరిస్థితి నెలకొంది. మసగుప్పి గ్రామంలో రాత్రికి రాత్రి నీరు చేరడంతో 600కు పైగా ఇళ్లు మునిగాయి. గ్రామస్థులందరినీ పునరావాస కేంద్రాలకు తరలించారు. పలువురు పెట్టా, బేడా సర్దుకుని బయల్దేరారు.

ముధోళ వద్ద మునిగిన వంతెన

ఘటప్రభ నదీ ప్రవాహంతో ముధోళ తాలూకాలోని ముధోళ-యాదవాడ ప్రధాన రహదారికి అనుబంధంగా ఉన్న వంతెన మునిగిపోవడంతో ప్రత్యామ్నాయంగా 25 కిలోమీటర్లు ప్రయాణించి ముధోళకు చేరుకుంటున్నారు. నీటి ప్రవాహం పెరిగితే పరిస్థితి మరింత తీవ్రం కావచ్చునని స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ముధోళ నగరం జుంజరకొప్ప వీధికి నీరు చేరింది. నగరంలోని ఎంకేబీఎస్ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాలూకా పరిధిలోని మిర్జి గ్రామానికి నీరు చేరడంతో 25 ఇళ్లు నీటమునిగాయి. గ్రామ పరిధిలోని ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. కొడగు జిల్లాలో 136 స్తంభాలు కూలిపోవడంతో పలు గ్రామాలకు విద్యుత్ సదుపాయం లేకుండా పోయింది. స్తంభాలు పడి ఆరు ఇళ్లు ధ్వంసమయ్యాయి. కృష్ణ, తుంగభద్ర జలాశయాలు పొంగి ప్రవహిస్తుండడంతో రెండు వంతెనలు మునిగి ఎళెబిచ్చాలి గ్రామంలో రాఘవేంద్ర స్వామి ఏకశిలా బృందావనం, జపదకట్టె జలావృతం అయ్యాయి.


జమఖండి తాలూకా ముత్తూరు నడుగడ్డె ప్రాంతంలో నీటిలో దాటుతున్న ప్రజలు


ముధోళ - యాదవాడ మార్గంలో మునిగిన వంతెన

సీఎం ఆదేశాలతో కదిలిన మంత్రులు

రెండు రోజులకిందట జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంత్రులను అప్రమత్తం చేయడంతో కదలిక వచ్చింది. రెండు రోజులుగా వరదపీడిత ప్రాంతాల్లో సంబంధిత జిల్లా ఇన్‌చార్జ్ మంత్రు లు పర్యటిస్తున్నారు. తద్వారా అధికారులు సహాయక చర్యలను వేగవంతం చేశారు. మంత్రి సతీశ్‌జార్కిహొళి బెళగావి జిల్లాలోని పలు వరద ప్రాంతాల్లో పర్యటించారు.


బెళగావి జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి సతీశ్ జార్కిహొళి

శిరూరులో సహాయక చర్యలు కొనసాగించండి: కేరళ సీఎం

ఉత్తరకన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరు గుట్ట కుశించుకుపోయిన ప్రమాదంలో లారీతోపాటు ముగ్గురి ఆచూకీ తెలియరాలేదు. కొండచరియలు విరిగిపడిన ప్రదేశంలోనే గంగావళి నది తీవ్రంగా ప్రవహిస్తుండడంతో గజ ఈతగాళ్లతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు కార్యాచరణ చేపట్టలేకపోతున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి స్థానిక మత్స్యకారులు తోడయ్యారు. సహాయక చర్యలు కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. మట్టి చరియలలో పడిపోయిన కేరళకు చెందిన లారీ డ్రైవర్ అర్జున్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు సహాయక చర్యలు కొనసాగించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారు.

అడిబట్టి గ్రామం వద్ద ఘటప్రభ ప్రవాహం ఇలా...



ఉడుపి జిల్లా గుండ్లబైలు గ్రామంలో రబ్బర్ బోట్లతో సహాయక చర్యలు

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- కేటాయింపులపై నిర్మలాసీతారామన్ అబద్ధాలు
- సీఎం సిద్దరామయ్య
- కావేరికి వాయనం సమర్పణ

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధమైన మండ్య జిల్లాలోని కేఆర్‌ఎస్, కబిని జలాశయాలకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య వాయనం సమర్పించారు. సోమవారం తొలుత కేఆర్‌ఎస్ జలాశయానికి చేరుకున్న సీఎం, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, చలువరాయస్వామి, వెంకటేశ్‌తో కలసి వాయనం సమర్పించారు. ఇదే సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి ఎలాంటి గ్రాంట్లు కేటాయించకపోయినా అన్యాయం జరగలేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించడం సరికాదన్నారు. ఆమె గతంలోనూ అబద్ధాలు చెప్పారని, మరోసారి పునరావృతం చేశారని అన్నారు. కేంద్ర పాలసీలతో 31శాతం ఎఫ్‌డీఏలు తగ్గాయని అన్నారు. కేంద్రానికి పన్నులు చెల్లించే రాష్ట్రాల్లో మహారాష్ట్ర తర్వాతి స్థానం కర్ణాటకదే అన్నారు. అయినా గ్రాంట్లు కేటాయించడంలో అన్యాయం చేశారన్నారు. ముడాలో అవినీతి జరిగిందని బీజేపీ పాదయాత్ర చేపట్టడం రాజకీయ కక్ష అన్నారు. బీజేపీ పాలనలో అవినీతి జరగలేదా.? అని ప్రశ్నించారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. అబద్ధాలు చెప్పడంలో బీజేపీ వారు సిద్ధహస్తులని అన్నారు. మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణంలో తమిళనాడుతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేంద్రం అనుమతి ఇస్తే నిర్మిస్తామని తెలిపారు. ఇదే సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ రానున్న పదేళ్లు కావేరిమాతకు వాయనం సమర్పించే శక్తి ఇవ్వాలని వేడుకున్నామన్నారు. జూలైలో తమిళనాడుకు 20 టీఎంసీలు కేటాయించాల్సి ఉండేదని, అంతకంటే ఎక్కువగానే విడుదల చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 87 టీఎంసీలు విడుదల చేశామని తెలిపారు. కన్నంబాడి కట్ట మనం అందరం భోజనం చేసే తట్ట అంటూ అభివర్ణించారు. కేఆర్‌ఎస్‌కు అనుబంధమైన బృందావన గార్డెన్స్‌కు కొత్తరూపు తీసుకొచ్చి గంగా హారతి తరహాలో కావేరి హారతి ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం కేఆర్ ఎస్ ప్రాజెక్టు నిర్మించేందుకు రూపకర్త అప్పటి మైసూరు మహారాజు నాల్వడి కృష్ణరాజ ఒడెయార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు రమేశ్ బండి సిద్దేగౌడ, నరేంద్ర స్వామి, కడలూరు ఉదయ్‌లు పాల్గొన్నారు.


కేఆర్‌ఎస్ డ్యామ్‌లో వాయనం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

పాదయాత్ర ఆపేది లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, పాదయాత్ర ఆపే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తేల్చి చెప్పారు. ఆగస్టు 3నుంచి చలో మైసూరు పాదయాత్రపై సోమవారం సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రశ్నే లేదన్నారు. తమ పాదయాత్రకు అనుమతులు లేవని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, వెనుకబడినవర్గాల సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరంగా ఉంటుందన్నారు. ఎస్టీ సామాజి వర్గానికి చెందిన గ్రాంట్లను లూటీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై పోరాటం చేయకుంటే భగవంతుడు మమ్మల్ని క్షేమించరని అన్నారు. ముడాలో రూ.3-4వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, మాజీ సీఎం సదానందగౌడ, ముఖ్యనేతలు సునిల్ కుమార్, ప్రీతం గౌడ, రాజీవ్, నందీశ్‌రెడ్డి, భైరతి బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



14 గంటల పనిపై 3న ఐటీ ఉద్యోగుల నిరసన

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రోజుకు 14 గంటలపాటు పని చేసేలా రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వారు నిరసనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 3న ఫ్రీడంపార్కులో నిరసన చేపడుతున్నారు. పనిగంటలను 14 గంటలకు పొడిగించాలని ఐటీ కంపెనీలు సిఫారసు చేసిన విషయం తెలిసిందే. దీంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రాష్ట్ర కార్మికశాఖకు వ్యతిరేకంగా నిరసనకు దిగుతున్నారు. ఫ్రీడంపార్కులో చేపట్టనున్న ఆందోళనలో వేలాదిమంది పాల్గొనేలా పిలుపునిస్తున్నారు. గత మూడు రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులు నిరసనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 14 గంటలకు విస్తరింపచేసేందుకు సానుకూలంగా నిర్ణయించడంపై ఐటీఈఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నిరసనకు సిద్ధమైంది. ఇప్పటికే సీఎం సిద్దరామయ్య కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్‌పై సోషల్‌మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. పని గంటలు పెంచాలనేది ప్రభుత్వ ఆలోచన కాకున్నా ఐటీ కంపెనీలు సిఫారసును కార్మికశాఖ మంత్రి వ్యతిరేకించినా చీఫ్ సెక్రటరీ ద్వారా కేబినెట్‌లో ప్రతిపాదించారు. సీఎం సిద్దరామయ్యపైనా కంపెనీల ముఖ్యులు ఒత్తిడి తీసుకొచ్చినట్టు ఐటీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో సి, డి గ్రూప్ ఉద్యోగాలను కన్నడిగులకే కేటాయించాలనే మంత్రివర్గతీర్మానంపై తీవ్రస్థాయిలో పారిశ్రామికవేత్తలు వ్యతిరేకించారు. దీంతో ఒకరోజు వ్యవధిలోనే కన్నడిగులకు ఉద్యోగాలలో రిజర్వేషన్ల అంశాన్ని వాయిదావేశారు. పారిశ్రామికవేత్తలు సూచించారని పని గంటలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధం కావడం ఎంతవరకు సమంజసమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దర్వేష్ కంపెనీపై దర్యాప్తు ముమ్మరం

- కంపెనీ ఏజెంట్ వసీం ఇంటిపై అధికారుల దాడులు
- రూ.కోట్లలో నగదు, బంగారు ఆభరణాల లభ్యం

రాయచూరు, జూలై 29 : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన దర్వేష్ కంపెనీ అవినీతి, అక్రమ వ్యవహారాలపై సీఐడీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీఐడీ ఎస్పీ పురుషోత్తమ్ నేతృత్వంలోని అధికారుల బృందం ఇప్పటికే దర్వేష్ కంపెనీలో భాగస్వాములుగా ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా వారు ఇచ్చిన సమాచారం మేరకు సోదాలు మరింత తీవ్రతరం చేశారు. ఈ క్రమంలో దర్వేష్ కంపెనీ ఏజెంట్ వసీం ఇంటిపై ఆదివారం రాత్రి దాడులు నిర్వహించిన సందర్భంగా రూ.2 కోట్లకు పైగా నగదు, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్లు లభించినట్లు పోలీసులు తెలిపారు. ఇతడితో పాటు మరో ఇద్దరు నిందితుల పై కూడా సోదాలు చేసేందుకు సీఐడీ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో అధిక వడ్డీ ఆశతో డిపాజిట్ చేసి నష్టానికి గురైన బాధితులు ఇంకా ఎవరైన ఉంటే సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రకటించారు. దర్వేష్ కంపెనీలో వేలాదిమంది డిపాజిట్ చేసిన సొమ్ము విలువ వందల కోట్లలోనే ఉంటుందని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ డిపాజిట్ చేసిన సొమ్ముకు గ్యారెంటీఞ లేదన్న అనుమానంతో నగరానికి చెందిన వెంకటేశ్ అనే బాధితుడు క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఈ క్రమంలోనే మార్కెట్ యార్డ్ పోలీసులు కేసు నమోదు చేయడం, కేసును క్రైం బ్రాంచ్ వారికి అప్పగించడం అనంతరం వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ విచారణను సీఐడీ బృందానికి అప్పగించడంతో ఒక్కసారిగా విచారణలో వేగం మొదలైంది.


నిందితులు కోర్టుకు..

దర్వేష్ కంపెనీ అవినీతి వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే సీఐడీ అధికారులు అరెస్టు చేసిన ముగ్గురు ఏ-4 నిందితులు బబ్లూ, అజర్, మోసీన్‌లను సోమవారం రాయచూరు జేఎంఎఫ్‌సీ కోర్టుకు హాజరుపరచారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసిన మార్కెట్ యార్డ్ పోలీసులు, క్రైం బ్రాంచ్ పోలీసులు కేసుకు సంబంధించిన పూర్వాపరాలను న్యాయస్థానానికి సమర్పించినట్లు సీఐడీ అధికారులు తెలిపారు. దర్వేష్ కంపెనీ నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని న్యాయస్థానానికి అప్పగించగా ఆగస్టు 2వ తేదీ వరకు పోలీస్ కస్టడీలో ఉంచేందుకు న్యాయస్థానం అనుమతించింది. దీంతో ప్రధాన నిందితుడు మహ్మద్ సుజాతో పాటు మిగతా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు మరింత ముమ్మర గాలింపు ప్రారంభించారు.


దర్వేష్ కంపెనీ ఏజెంట్లు బబ్లూ, మోసీన్, అజర్




దాడుల్లో పట్టుబడిన రూ.2 కోట్లకు పైగా నగదు, నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్న పోలీసులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.88	1,621.80
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,47,122	88,059
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,56,248	930
సామర్థ్యం (టీఎంసీలు)	97.41	66.52

నీట మునిగిన పంట పొలాలు

మదలగట్టి ఆంజనేయ స్వామి ఆలయానికి వరద తాకిడి... నది వెంబడి గ్రామాలకు పొంచి ఉన్న వరద ముప్పు.. డీబీ డ్యాం నుంచి ఆరో రోజూ భారీగా వరద నీరు





బళ్లారి వద్ద నీట మునిగిన పంటపొలాలు, మదలగట్టి ఆంజనేయస్వామి దేవాలయం జలావృతం, కంప్లి కోట వద్ద నీట మునిగిన వంతెన

బళ్లారి సిటీ/కంప్లి, జూలై 29: విజయనగరం జిల్లా హూవినహడగలి తాలూకాలోని మదలగట్టి ఆంజనేయ స్వామి దేవాలయం ముంపునకు గురైంది. హూవినహడగలి కొండపాక, అర్ధమెట్ల ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర నదికి పెద్దఎత్తున నీరు చేరుతోంది. తాలూకాలోని మకరబ్బి గ్రామంలో 30 ఎకరాలకు పైగా వరిపంట నీట మునిగింది. సమీపంలోని సింగటలూరు బ్యారేజీ వద్ద 1,68,488 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో సమోదవగా, 17 గేట్లను తెరిచి అదేస్థాయిలో నీటిని నదిలోకి విడుదల చేశారు. బ్యారేజీ ప్రెజర్‌ను సమాంతరంగా నిర్వహించేందుకు 24 గంటలూ పర్యవేక్షించేలా సిబ్బందిని ఏర్పాటు చేశామని ప్రాజెక్టు ఏఈఈ రాఘవేంద్ర తెలిపారు. శ్రీక్షేత్రం మాదలగట్టి ఆంజనేయ దేవాలయం ముందు చివరి మెట్లపైకి నది నీరు చేరింది. నదిలోకి ఎవరూ దిగకూండా ఆలయం ముందు తాడు కట్టి అవగాహన కల్పించారు.

వందల ఎకరాల పంట మునక

హూవినహడగలి మెట్ట ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది వెంబడి ఉన్న గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు జారీ చేశారు. తాలూకాలోని హిరేబన్ని, మకరబ్బి, బాలహున్సి, నందిగవి గ్రామాల్లో నది ఒడ్డున ఉన్న వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. వందల ఎకరాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.

భారీగా వరద

తుంగభద్ర జలాశయం నుంచి ఆరో రోజూ భారీగా వరద నీటిని నదికి వదిలారు. జలాశయం నుంచి సోమవారం 1,47,000 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదిలారు. హంపి, కంప్లి కోట ప్రాంతాల వద్ద నీరు పోటెత్తి ఆలయాల్లోకి చేరింది. ముంపు కారణంగా ప్రజలు తెప్పల మీద సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నారు. అరటి, చెరకు పంటలకు ముంపు కారణంగా నష్టం వాటిల్లింది. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.



నీటి ప్రవాహాన్ని తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు

మల్లె రైతులకు నష్టాలు

భారీగా తగ్గిన పూల ధరలు



కంప్లి కోట వద్ద మల్లెలను కోస్తున్న కూలీలు

కంప్లి, జూలై 29: మల్లెలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధరలు తగ్గడంతో పెట్టుబడులు కూడా తిరిగిరావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో కేవలం రూ.200 పలుకుతున్నాయి. కిలో మల్లెలు కనీసం రూ.500-600 ధర పలికితేనే తమకు పెట్టుబడి తిరిగి వస్తుందని, ఇంత తక్కువ ధరకు నష్టాలు తప్పవని అంటున్నారు. గుండు మల్లెలు, ఇతర రకాల మల్లెలు సాగు చేసేందుకు పెట్టుబడి బాగా పెరిగింది. ధరలు లేకపోవడంతో కూలీల ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుకు ఒక్కొక్కరికి రూ.300 చెల్లిస్తేగాని కూలీలు దొరకడం లేదని అంటున్నారు. వేలాది రూపాయలు కౌలు చెల్లించి పంటలు సాగుచేశామని, చివరకు నష్టాలే మిగిలాయని రైతు వెంకటేష్ అన్నారు. మల్లెల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

డెంగీతో విద్యార్థిని మృతి

సిరుగుప్ప, జూలై 29 : డెంగీతో ఎస్‌ఈఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని బీఎం వాత్సల్య సోమవారం మృతి చెందారు. దీంతో బాలిక కుటుంబం శోక సంద్రంలో మునిగింది. విద్యార్థిని మృతి పట్ల పాఠశాల అధ్యక్షులు బీఈ రామయ్య, ప్రిన్సిపాల్ లిల్లీ థామస్, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. పాఠశాలకు సెలవు ప్రకటించారు.

ప్రైవేటు భవంతిలో ఎక్సైజ్ కార్యాలయం



ప్రైవేటు బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ కార్యాలయం

కంప్లి, జూలై 29: కంప్లి తాలుకాలో ఎక్సైజ్ స్టేషన్‌ను ప్రైవేటు భవంతిలోనే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భవంతి లేకపోవడంతో అధికారుల, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంప్లి, కురుగోడు తాలుకాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రికార్డులను భద్రపరిచేందుకు సరైన సదుపాయాలు లేవని వాపోతున్నారు. సీజ్ చేసిన వాహనాలను ఆరు బయట పెట్టాల్సి వస్తోందని అంటున్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

పెనుకొండ, జూలై 29: మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కాళ్లపై తాము నిలబడాలని టింబక్టివ్ కలెక్టివ్ వ్యవస్థాపకుడు మేరీ గంగూలీ అభిప్రాయపడ్డారు. సోమవారం స్థానిక దుర్గాశక్తి సొసైటీ కార్యాలయంలో సొసైటీ 13వ వార్షికోత్సవ సభను నిర్వహించారు . కార్యక్రమానికి లక్ష్మమ్మ అధ్యక్షత వహించగా సీఈఓ కవిత ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మేరి గంగూలి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కలిసికట్టుగా ముందుకెళ్లి అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం సీఈఓ సవిత మాట్లాడుతూ ప్రస్తుతం దుర్గాశక్తి సొసైటీ రెండు మండలాల్లో 79 గ్రామాల్లో 360 సంఘాల్లో 8,655 మంది సభ్యులు ఉన్నారన్నారు. రూ.13.07 కోట్ల నికర విలువతో కొనసాగుతుందన్నారు. అనంతరం ఈ వార్షిక సమావేశంలో వార్షిక వేదిక ఆర్థిక లావాదేవీలు, పాలకవర్గంలో మార్పులు చేర్పులు తదితర విషయాలపై చర్చించారు. మేనేజర్ సుకన్య, మహాశక్తి సీఈఓ రమేజ, అసోసియేట్ రవళి, పావని, గౌరీ, సిబ్బంది మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గనుల తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు

రైతు, ప్రజా సంఘాల డిమాండ్.. పట్టణంలో నిరసన ర్యాలీ

బళ్లారి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సండూరు అటవీ ప్రాంతంలో దేవదారి, ఇతర ప్రాంతాల్లోని కుద్రేముఖ్, మరో కంపెనీకి ఇనుప ఖనిజం తవ్వకాలకు అనుమతి ఇవ్వవద్దని వివిధ సంఘాలు డిమాండ్ చేశారు. జనసంగ్రామ పరిషత్, రాష్ట్ర రైతు సంఘం, హసరుసేన, ఏఐడీఎస్‌వో, ప్రజా సంఘాల నేతృత్వంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. జనసంగ్రామ పరిషత్, గనుల్లో అక్రమాల పోరాట సమితి నాయకుడు హిరేమఠ్, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మాధవరెడ్డి, చాగనూరు, శిరువార విమానాశ్రయ భూ బాధితుల పోరాట సమితి నాయకుడు మల్లికార్జున రెడ్డి సంఘం సర్కిల్ నుంచి డీసీ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. కుద్రేముఖ్, ఇతర కంపెనీలకు సండూరులో ఉన్న అటవీ ప్రాంతంలో గనుల్లో తవ్వకాలకు అనుమతి ఇవ్వరాదని హిరేమఠ్ డిమాండ్ చేశారు. ఇక్కడ గనులు త్వకాలకు అనుమతి ఇస్తే పర్యావరణం దెబ్బతింటుందని, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, వన్యప్రాణుల సంరక్షణ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మాధవరెడ్డి, శిరువార, చాగనూరు విమానాశ్రయ భూ బాధితుల నాయకుడు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, సండూరు అటవీ ప్రాంతంలో గనులు తవ్వకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి ఇవ్వరాదని డిమాండ్ చేశారు. 2004 నుంచి 2010 కాలం మధ్యలో ఇక్కడ ఇనుప గనుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి.. వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఫలితంగా పర్యావరణం కలుషితమైందని, ప్రజలు అనారోగ్యం పాలయ్యారని అన్నారు. వేలాది ఎకరాల భూములు నష్టపోయాయని తెలిపారు. అప్పట్లో అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష పడేవరకూ పోరాడామని అన్నారు. 2004-2010 మధ్య కాలం పరిస్థితిని ఇక్కడ రాకుండా చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సండూరు అటవీ ప్రాంతంలో ఇనుప గనుల తవ్వకాలకు కుద్రేముఖ్, ఇతర కంపెనీకి అనుమతి ఇస్తే ప్రజాపోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సర్దుకోకుంటే చర్యలు తప్పవు

- లారీ ఓనర్లు.. స్పాంజ్ ఐరన్ కంపెనీలకు డీసీ వార్నింగ్
- ఐరన్ లోడింగ్‌లో ఇరువర్గాల మధ్య వివాదం

బళ్లారి, జూలై 29(ఆంధ్రజ్యోతి): లారీ ఓనర్ల అసోషియేషన్, స్పాంజ్ ఐరన్ కంపెనీల మధ్య వివాదం తీవ్రస్థాయికి చేరింది. జిల్లా పోలీసులు, జిల్లా కలెక్టర్ వద్ద పది రోజులుగా పంచాయితీ నడుస్తోంది. వివాదాలకు తలెత్తకుండా చూసుకోవాలని, లేదంటే ఇరువర్గాలపైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు, కలెక్టర్ హెచ్చరించారు. ఇరువర్గాలను సోమవారం పిలిపించిన కలెక్టర్.. ఏఎస్పీ రవికుమార్ సమక్షంలో వార్నింగ్ ఇచ్చారు. స్పాంజ్ ఐరన్ కంపెనీల్లో ఐరన్ లోడింగ్‌కు లారీలు క్యూలో పెట్టాలని లారీ యూనియన్ పట్టుపట్టింది. అలా చేస్తే నష్టపోతామని స్పాంజ్ ఐరన్ కంపెనీదారులు అంటున్నారు. ఈ విషయంలో రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తడంతో అధికారులు జోక్యం చేసుకున్నారు. రాజకీయ జోక్యంతో వివాదం ముదిరిందని కొందరు అంటున్నారు. ఈ కారణంగా వారం రోజులుగా తాము ఇబ్బంది పడుతున్నామని దూర ప్రాంతాల నుంచి వచ్చే లారీల యాజమానులు వాపోతున్నారు. లోడింగ్‌కు వెళ్లే లారీల ట్రిప్ సీట్లు, రికార్డులను కొందరు లాక్కుంటున్నారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చివరకు సోమవారం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో కూడా పంచాయితీ సాగింది. అక్కడ కూడా సమస్యకు పరిష్కారం లభించలేదు.

బళ్లారి రాఘవ జయంత్యుత్సవాలకు సిద్ధం

2, 3 తేదీలలో వేడుకలు



బళ్లారి రాఘవ

బళ్లారి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సాధారణ రైతు కుటుంబంలో జన్మించి.. కళాకారుడిగా ఖండాంతర ఖ్యాతిగడించిన గొప్ప నటుడు బళ్లారి రాఘవ. తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ తదితర భాషల్లో రంగస్థలంపై తన నటనతో అలరించారు. కళాభిమానుల మదిలో జీవించే ఉన్న బళ్లారి రాఘవ 144 జయంతి ఉత్సవాలను రాఘవ మెమోరియల్ అసోషియేషన్ సిద్ధమౌతోంది. ఆగస్టు రెండు, మూడు తేదీలలో రెండు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని రాఘవ కళామందిరం అసోషియేషన్ సోమవారం తెలిపింది. ఆగస్టు 2న రాఘవ కళామందిరం నుంచి గడిగే చెన్నప్ప సర్కిల్ వరకూ రాఘవ ప్రతిమను ఊరేగిస్తామని తెలిపారు. రాఘవ కళామందిరంలో తొలిరోజు సాయంత్రం జయంతి వేడుకను నిర్వహిస్తామని, జిల్లా న్యాయాధికారి కేజీ శాంత ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. కేఏఎస్ అధికారి రుద్రేష్, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కులపతి పాల్గొంటారని తెలిపారు. రాఘవ మెమోరియల్ గౌరవ అధ్యక్షుడు కె.చన్నప్ప చేతుల మీదుగా బళ్లారి రాఘవ రాష్ట్ర అవార్డు గ్రహీతలకు బహుతులు ఇస్తామని తెలిపారు. వివిధ కన్నడ నాటకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 3వ తేదీ సాయంత్రం రాఘవ కళామందిరం అధ్యక్షుడు కోటేశ్వరావు అధ్యక్షతన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విశ్రాంత న్యాయాధికారి మంజుల చెల్లూరు పాల్గొంటారని తెలిపారు. కోనేటి సుబ్బరాజు అవార్డులు ప్రధానం చేస్తారని తెలిపారు. సాయంత్ర వివిధ కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

1న వ్యసన రహిత దినోత్సవం

ఏడీసీ మహ్మద్ జుబేరా

బళ్లారి సిటీ, జూలై 29: మహంత శివయోగి జయంతి వేడుకలలో భాగంగా ఆగస్టు 1న జిల్లాస్థాయి వ్యసన రహిత దినోత్సవం నిర్వహిస్తామని జిల్లా సహాయ కలెక్టర్ మహ్మద్ జుబేరా తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వేడుకల వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లాలోని అన్ని తాలూకాల్లో వ్యవసన రహిత దినోత్సవం, అవగాహన జాతా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మహంత శివయోగి జయంతిని మాదకద్రవ్యాల రహిత దినోత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాస్థాయిలో ఆగస్టు 1న నగరంలోని సాంస్కృతిక సముదాయ ప్రాంగణంలో వేడుకలను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సరళాదేవి ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులచేత అవగాహన జాతా నిర్వహిస్తారు. అవగాహన నినాదాలతో పోస్టర్లు, బోర్డులను ప్రదర్శించాలని సహాయ కలెక్టర్ ఆదేశించారు. కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు గురురాజ, సాంఘిక సంక్షేమశాఖ, పోలీసుల శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు

బళ్లారి రూరల్, జూలై 29: వేదవతి నదీ తీరాన.. బోరు బావుల కింద వరి నారుమళ్లు వేసుకున్నారు. బళ్లారి తాలుకాలోని మోకా, ఎర్రగుడి, భైర దేవనహళ్లి, గోటూరు, కేకే హాళ్, వణుకునూరు తదితర ప్రాంతాలు నారుమళ్లతో పచ్చదనాన్ని సంతరించుకున్నారు. భద్రావతి, శివమొగ్గ, హరిహర, హావేరి ప్రాంతాల్లో అత్యధికంగా వర్షాలు కురవడంతో వరినాట్లు జోరందుకున్నాయి. తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయిలో నిండి.. దిగువకు నీరు వెళుతోంది. దీంతో రైతులు వరినాట్లు వేసుకుంటూ తీరికలేకుండా గడుపుతున్నారు.



భైరవ దేవనహళ్లి గ్రామం వద్ద వరినాట్లు వేస్తున్న మహిళలు



ముందస్తుగా నాట్లు వేసేందుకు వరినారు సిద్ధం చేసుకున్న రైతులు

నీటి పారుదల శాఖ ఏఈగా ఉలిగమ్మ



నీటిపారుదల శాఖ ఏఈగా ఆదేశ పత్రాలను స్వీకరిస్తున్న ఉలిగమ్మ

సిరుగుప్ప, జూలై 29: నీటి పారుదల శాఖ డీఈఈ ఆదేశాల మేరకు ఏఈగా ఉలిగమ్మ బాధ్యతలు స్వీకరించారు. సిరుగుప్ప తాలుకాలోని ఉడదరాళ గ్రామానికి చెందిన ఉలిగమ్మ డిప్లమో పూర్తి చేశారు. నీటి పారుదల శాఖ కార్యాలయ ఏఈ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఆమె విద్యార్హతను గుర్తించి ఏఈగా నియమించింది. ఈ సందర్భంగా సిరుగుప్ప తాలుకా ప్రజలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు.

నేడు ఆడికృత్తిక మహోత్సవాలు

బళ్లారి సిటీ, జూలై 29: నగరంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలోని కుమారస్వామి ఆలయంలో మంగళవారం ఆడి కృత్తిక మహోత్సవ పూజలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప, ఆలయ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆలయలో ఉదయం ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామని, భక్తలు తీసుకొచ్చిన కావడితో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు. కుమారస్వామి జన్మదిన వేడుకలను పూర్తి చేసి, సాయం త్రం పల్లకిలో ఊరేగిస్తామని, లలితా సహస్రనామ పారాయణం నిర్వహిస్తామని తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో కుమారస్వామి



ముస్తాబైన కుమారస్వామి దేవాలయం

హోసూరు జోన్

ఘనంగా ఆడికృత్తిక ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

హోసూరు జూలై 29 : స్థానిక బృందావనం నగరంలోని శ్రీవల్లీ దేవాని సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆడికృత్తిక రోజును పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకం అనంతరం స్వామి వారికి వెండి కవచం అలంకరించి మహా దీపారాధన నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ కోర్కెలు తీర్చుకునేందుకు పాల కావడి, పన్నీర్ కావడి, పుష్ప కావడి తీసుకొచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. భక్తులు బారులు తీరి స్వామి దర్శనం చేసుకున్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) జూలై 29 : కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ కేఎం సరయు ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 244 వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిషన్లు, వృద్ధాప్య పింఛన్, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలపై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతులను పరిశీలించి పిటిషనర్లకు తగిన వివరణ ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పన్నీర్‌సెల్వం, జిల్లా వెనుకబడిన సంక్షేమాధికారి పద్మలత, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి రమేశ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నారేయణతాతయ్య ఆరాధన మహోత్సవం



వెంకటేశ్వరస్వామికి గురుపూజ నిర్వహిస్తున్న భక్తులు

హోసూరు, జూలై 29: హోసూరు సమీపాన బుక్కసాగరం గ్రామంలో సద్గురు నారేయణతాతయ్య మఠం 19వ వార్షిక ఆరాధన మహత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మఠం సంస్థాపకుడు, అష్టాక్షరీ మహామంత్ర తపోవన పీఠాధిపతి బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వామి నేతృత్వం వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా శ్రీనివాసులు హాజరయ్యారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, గురు అష్టోత్తర పూజ నిర్వహించి 9 గంటలకు పూల పల్లకీలో స్వామిని ఊరేగించారు. 10 గంటలకు నుంచి 2 గంటల వరకు నారేయణతాతయ్య భక్తమండలిచే భజన, అష్టోత్తర జపం నిర్వహించారు. బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వామిజీ సద్గురు తాతయ్య గురించి ప్రసంగిచారు. అనంతరం మహా మంగళారతి, తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తాదులు పాల్గొని స్వామిజీ ఆశీస్సులు పొందారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేసిన కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) జూలై 29 : వివిధ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సోమవారం కలెక్టర్ సరయు ఉచిత యూనిఫాం పంపిణీ చేశారు. కృష్ణగిరి జిల్లాలోని కటిగానపల్లి, పోడూరు పంచాయతీ యూనియన్ ప్రాథమికోన్నత పాఠశాల, పాత సబ్‌జైలు రోడ్డు ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల, రాశివీధి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. మొదటి దశలో కటిగానపల్లి పోడూరు పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో 129 మంది బాలురు, 134 మంది బాలికలు, పాత సబ్‌జైల్‌రోడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 142 మంది బాలురు, 131 మంది బాలికలకు యూనిఫారాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షురాలు మణిమేగలై నాగరాజ్, జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారి కేపీ మహేశ్వరి, జిల్లా సామాజిక సంక్షేమ అధికారి జయంతి, పారిశ్రామిక సహకార అధికారి తులసి, కటిగానపల్లి పుత్తూరు పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంత్...

రా వి శాస్త్రి (జయంతి)



ప్రముఖ రచయిత రా వి శాస్త్రిగా పేరొందిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి 1922 జూలై 30న శ్రీకాకుళంలో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా రచయితగా పేరొందారు. 'అల్పజీవి' నవల ఉత్తమంగా నిలిచింది. రాచకొండ కథలు, కథా సాగరం, బంగారం, రాజు మహిషీ, రత్తాలు-రాంబాబు, ఇల్లు తదితర నవలలు పేరొందాయి. శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖ జిల్లాల మాండలికంలో అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలపై చేసిన రచనలు ఆకట్టుకున్నాయి. నిజం, కన్యాశుల్కం నాటికలలో నటించారు. ఆంధ్ర యూనివర్సిటీ 'కళాప్రపూర్ణ' పురస్కారం ప్రకటించగా సున్నితంగా తిరస్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని వాపసు చేశారు. 'విరసం' సంస్థాపకులలో ఒకరు. 1993 నవంబరు 10న కన్నుమూశారు.

పులికంటి కృష్ణారెడ్డి (జయంతి)



రాయలసీమ చిన్నోడిగా పేరొందిన సాహితీవేత్త పులికంటి కృష్ణారెడ్డి 1931 జూలై 30న చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం జక్కదోన గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. నాలుగ్గాళ్ళ మండపం పుస్తకం మరో ప్రత్యేకత. రాయలసీమ ప్రజల కష్టాలను తన కథల్లో సహజంగా చిత్రించిన అరుదైన కథకుడు. 13 ఏళ్ల రైల్వేశాఖలో పనిచేసి కేవలం సాహిత్యం, కళలకోసం ఉద్యోగం వదులు కున్నారు. 200 కథలు, 60 కవితలు, 5 దృశ్య నాటికలు, 43 అమ్మిపదాలు రాశారు. గూడుకోసం గువ్వలు, పులికంటి కథలు, కోటిగాడు స్వతంత్రుడయ్యాడు వంటి గ్రంథాలు వెలువరించారు. 'కామధేను' పక్షపత్రికను ఆరేళ్ల నడిపారు. ఆకాశవాణి, దూర దర్శన్‌లలో ఆడిషన్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. చిత్తూరు జిల్లా రచయితల సంఘానికి ఉపాధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. 2007 నవంబరు 19న కన్ను మూయడంతో రాయలసీమ మాండలికం మూగబోయింది.

దేవదాస్ కనకాల (జయంతి)



దేవదాస్ కనకాల 1945 జూలై 30న యానాంలో జన్మించారు. తెలుగులో పేరొందిన నటుడు, దర్శకుడు, నట శిక్షకుడు. పూనె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన తొలితరం తెలుగు నటులలో ఒకరు. చలిచీమలు సినిమాకు దర్శకత్వం వహించారు. అడయార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీగా, తెలుగు యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్ డెవలెప్‌మెంట్‌కు విభాగాధిపతిగా కొనసాగారు. వెండితెరపైనా, బుల్లితెరపైనా, నాటక రంగంలోనూ ఎంతోమంది నటులకు శిక్షణ ఇచ్చారు. రజనీకాంత్, చిరంజీవి, రాజేంద్రప్రసాద్ వంటివారు ఆయన వద్ద శిక్షణ పొందినవారే. ఓ సీతకథ, గ్యాంగ్‌లీడర్, మంచు పల్లకి, మనసంతా నువ్వే జోష్ తదితర సినిమాల్లో నటించారు. 2019 ఆగస్టు 2న కన్నుమూశారు. కాగా ఆయన కుమారుడు రాజీవ్ కనకాల కూడా నటుడిగా పేరొందారు.

జీన్ ప్యాట్రిక్ మొడియానో (పుట్టినరోజు)



జీన్ ప్యాట్రిక్ మొడియానో 1945 జూలై 30న జన్మించారు. ఫ్రాన్స్ దేశంలో ప్రముఖ రచయితలలో ఒకరైన ఆయన 2014లో సాహితీ రంగంలో నోబెల్ ప్రైజ్ అందుకున్నారు. 2012లో ఆస్ట్రియన్ స్టేట్ ప్రైజ్ ఫర్ యూరోపియన్ లిటరేచర్, నేషనల్ లిటరేచర్ గ్రాండ్ ప్రైజ్ ఇతర అవార్డులు అందుకున్నారు. పిల్లల పుస్తకాలు కూడా రాశారు. ఆయన రచనలు 30 భాషలలోకి తర్జుమా కావడం విశేషం. స్క్రీన్ రైటర్‌గానే కాక బుల్లితెర, వెండితెరపై నటుడిగా కూడా గుర్తింపు పొందారు.

అర్నాల్డ్ స్వార్జ్‌నెగ్గర్ (పుట్టినరోజు)



అర్నాల్డ్ అలోయిస్ స్వార్జ్‌నెగ్గర్ 1947 జూలై 30న జన్మించారు. ఆస్ట్రియన్ - అమెరికన్ నటుడు, నిర్మాత, వ్యాపారవేత్త, రిటైర్డ్ బాడీ బిల్డర్, మాజీ రాజకీయవేత్త. 2003 నుంచి 2011 వరకు క్యాలిఫోర్నియా 38వ గవర్నర్‌గా వ్యవహరించారు. వెయిట్ లిఫ్టర్‌గా కెరీర్ ప్రారంభించి 'మిస్టర్ ఒలింపియా'లో సత్తా చాటుకున్నారు. ప్రెసిడెంట్స్ కౌన్సిల్ ఆన్ ఫిజికల్ ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్‌కు 1990 నుంచి 1993 వరకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. అనంతరం హాలీవుడ్ యాక్షన్ ఫిల్మ్‌స్టార్‌గా ఎదిగారు. 'టర్మినేటర్' సిరీస్, కమాండో, ట్రూ లైస్, ప్రిడేటర్ వంటి సినిమాలతో ఎంతో పేరొందారు. 'ఓక్ ప్రొడక్షన్స్' సంస్థాపకులు.

సోనూ నిగమ్ (పుట్టినరోజు)



ప్రముఖ గాయకుడు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సోనూ నిగమ్ 1973 జూలై 30న హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో జన్మించారు. మోడ్రన్ రఫీగా అభిమానులు పిలుస్తారు. జాతీయస్థాయిలో గాయకుడిగా, సంగీత దర్శకుడు, నటుడు, వ్యాఖ్యాతగా రాణించారు. హిందీ సినిమాల్లో ఎక్కువ పాటలు పాడారు. బెంగాలీ, కన్నడ, తెలుగు, తమిళం, మరాఠీ, ఒరియా, గుజరాతీ, అస్సామీ, తుళు, మైథిలీ, నేపాలీ, పంజాబీ తదితర భాషల్లోనూ పాటలు పాడారు. భక్తి గీతాలతోపాటు దేశవాళీ పాప్‌ఆల్బమ్స్ విడుదల చేశారు. భారతీయ గాయకులలో అత్యధిక పారితోషికం అందుకునే వారిలో ఒకరు. దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. ఒక జాతీయ, రెండు ఫిల్మ్‌ఫేర్, ఇండియన్ టెలి విజన్ అకాడమీ అవార్డ్స్ తదితర అవార్డులు పొందారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి, జూలై 29 : భార్య పుట్టింటికి వెళ్లడంతో జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. సోమవారం సడ్లపల్లి పంచాయతీ తిలక్‌నగర్‌లో ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపీ తెలిపిన వివరాల మేరకు తిలక్‌నగర్‌కు చెందిన దేవరాజ్(25) కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య నాగమణి కుటుంబ కలహాలతో నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో ఒంటరి జీవితాన్ని భరించలేక సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉన్న కొక్కికి చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ గోపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పచ్చదనంలో గూళూరు హైస్కూల్‌కు పురస్కారం

» సత్యసాయి ట్రస్టు నుంచి ..

బాగేపల్లి, జూలై 29: తాలూకాలోని గూళూరు హోబళిలోని ప్రభుత్వ హైస్కూల్ పచ్చదనం, స్వచ్ఛత అంశంలో చిక్కబళ్ళాపురలోని సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఇస్తున్న రాష్ట్రస్థాయి హసిరు నైర్మల్య శాలా అభ్యుదయ పురస్కారం దక్కించుకుంది. వంద పాఠశాలల్లో గూళూరు ప్రభుత్వ పాఠశాల ఎంపిక కావడం విశేషం. పురస్కారం కింద రూ.10వేల నగదు పారితోషికం అందచేశారు. పాఠశాల హెడ్మాస్టర్ వెంకటేశ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 27న చిక్కబళ్ళాపుర జిల్లా ముద్దేనహళ్ళిలోని సత్యసాయి గ్రామంలో ఏర్పాటైన కార్యక్రమంలో సద్గురు మధుసూదన సాయి దివ్యసాన్నిథ్యంలో పురస్కారం అందుకున్నట్టు తెలిపారు. గూళూరు ప్రభుత్వ పాఠశాల ఒక ఎకరా స్థలంలో విస్తరించిందని అటవీశాఖ, పూర్వ విద్యార్థుల సంఘం, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ రమేశ్, గ్రామ పంచాయతీ సహకారంతో వందలాది మొక్కలు నాటినట్టు తెలిపారు. ఈ పురస్కారానికి ప్రధాన కారణం విద్యార్థులందరి కృషి, వ్యాయామ ఉపాధ్యాయుడు రంగనాథ్, సీఆర్‌పీ వెంకటేశ్‌ల మార్గదర్శకమేనన్నారు. పురస్కారం దక్కడంపై బీఈఓ ఎం తనుజా అభినందించినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు పురస్కారం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.



పురస్కారంతో విద్యార్థులతో ఉపాధ్యాయులు తదితరులు

సంస్కారంతోనే విజయం సాధ్యం

శిడ్లఘట్ట, జూలై 29: కేవలం పాఠాలకే పరిమితం కాకుండా సంస్కారంకూడా నేర్చుకుంటేనే విజయం సాధ్యమని జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు డివి ఓబళప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సాదలి హోబళిలోని ఎస్ దేవగానహళ్ళిలో ఏర్పాటైన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్టు, అంబ కనక దుర్గాదేవి ఆలయ సేవా సమితి సంయుక్తంగా జాతరలో భాగంగా ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఓబళప్ప మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సంస్కారం, క్రమశిక్షణ నేర్చుకోవాలని తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలన్నారు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం వంటి మహనీయుల పుస్తకాలను చదివి మార్గదర్శకాలను పాటించాలన్నారు. కన్నడ సంస్కృతి ఆధ్వర్యంలో పిల్లల జానపద, భరతనాట్యం సామూహిక నృత్యాల ప్రదర్శన ఆకట్టుకుంది. సంగీత విద్వాంసుల జానపద సంగీత వాద్యకారులు, దుర్గా పరమేశ్వరి డప్పు బృందం ఆధ్వర్యంలో వాద్యగోష్ఠి ప్రదర్శన సాగింది. ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీలలో అత్యధిక మార్కులు పొందిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వెంకటేశ్వర ఎడ్యుకేషన్ ట్రస్టు సంస్థాపక డైరెక్టర్ డీవీ ప్రసాద్, ఎంపీసీఎస్ డైరెక్టర్ తిమ్మయ్య, ఎస్ఎల్‌విజిటి అధ్యక్షులు పిఎన్ అంబిక తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాల ప్రదానంలో ప్రముఖులు



పిల్లల నృత్య ప్రదర్శన

గోకర్ణ ఆలయానికి కమిటీ ఏర్పాటుకు
రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లాలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం గోకర్ణలోని మహాబళేశ్వర ఆలయానికి కమిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో కొన్నేళ్లుగా ఉన్న వివాదం మలుపు తిరిగింది. 2021లో అప్పటి బీజేపీ ప్రభుత్వం గోకర్ణ ఆలయ పర్యవేక్షణ రామచంద్రాపుర మఠానికి అప్పగించారు. దీంతో వివాదం సుప్రీం కోర్టుకు చేరింది. సుదీర్ఘ విచారణల తర్వాత గోకర్ణ ఆలయానికి పాలకమండలి ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పాలకమండలి ఏర్పాటుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కృష్ణ నేతృత్వంలో కమిటీని 2021లో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. కమిటీ సమర్పించిన నివేదికను సుప్రీంకోర్టు అంగీ కరించింది. పాలకమండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిర్దేశించింది. ఎటువంటి చర్చలు, తీర్మానాల చేయాల్సి ఉన్నా శ్రీకృష్ణ కమిటీతో చర్చించాలని సూచించింది. గోకర్ణలోని మహాబళేశ్వర మఠం ఆధ్వర్యంలో వంశపారంపర్యంగా పూజలు చేసుకుంటూ వస్తున్న అర్చక వంశస్థులకు, రామచంద్రాపుర మఠానికి ఎవరు పూజ చేయాలనేది 12ఏళ్లుగా వివాదం సాగుతోంది. 2021లో ఒక దశకు తెచ్చారు. రామచంద్రాపురం మఠం నుంచి దేవాలయాన్ని మార్చు చేయాలని సూచించారు. కానీ పాలకమండలిని ఏర్పాటు చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వకుండా బీఎన్ కృష్ణ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ వివాదంపై విచారణలు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తూనే నలుగురు ప్రైవేట్ వ్యక్తులకు అవకాశం ఇచ్చారు. గోకర్ణ మహాబళేశ్వర ఆలయం క్రీస్తుశకం 4వ శతాబ్దం నుంచి ఉన్నట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. గోకర్ణ ప్రదేశంలో వెలసి ఉన్నందున గోకర్ణగానే పిలుస్తారు. ద్రావిడ వాస్తుశిల్పశైలిలో నిర్మించారు. హిందువులు పవిత్రయాత్రాస్థలాలలో ఒకటి కాగా పౌరాణిక చరిత్ర కూడా ఉంది.



గోకర్ణలో మహాబళేశ్వరస్వామి ఆలయం

ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం

అవయవదానంతో మానవత్వం చాటిన కుటుంబం

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా తిపటూరు పట్టణంలోని హళియార్ రోడ్డులోని పాఠశాల ముగించుకుని వాపసు వెళ్తుండగా ఏడో తరగతి విద్యార్థిని చందన (13) రోడ్డు ప్రమాదంలో గాయపడింది. గత మంగళవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన చందనను వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని తలకు తీవ్ర గాయాలు కావడంతో మెదడు పూర్తిగా నిష్క్రియగా మారింది. బ్రెయిన్‌డెడ్ కారణంగా విద్యార్థినికి ఇస్తున్న చికిత్సలు ఫలించవని వైద్యులు నిర్ధారించడంతో బాలిక తల్లిదండ్రులు వసంత కుమార్, దివ్యలు అవయవదానం చేసేందుకు తీర్మానించారు. తద్వారా ఆరుగురికి జీవం పోసినట్టు అవుతుందని డాక్టర్లు సూచించారు. కుమార్తె మృతిలోనూ మానవత్వం చాటుకోవడంపై స్థానికంగా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఒక మైనరు బాలిక అవయవదానం చేయడం జిల్లాలో ఇదే ప్రథమమని తెలుస్తోంది. వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది బాలిక చందన మృతిపట్ల శ్రద్ధాంజలి ఘటించారు. పాఠశాలకు సెలవు ప్రకటించారు. బాలిక పార్థివదేహాన్ని ప్రభుత్వ గౌరవంతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఉప విభాగం అధికారి సప్తశ్రీ, వినాయక శెట్టిగేరి, తాలూకా పంచాయతీ ఈఓ సుదర్శన్, నగరసభ కమిసనర్ విశ్వేశ్వరయ్య బదరగడె, మాజీ మంత్రి బీసీ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



చందన పార్థివదేహం

కన్నడ రథానికి ఘన స్వాగతం

శిడ్లఘట్ట, జూలై 29: కర్ణాటక నామకరణం జరిగి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా హెసరాగలి కర్ణాటక ఉసిరాగలి కన్నడ నినాదంతో కన్నడ మాత భువనేశ్వరి దేవి, సాధకుల రథం చిక్కబళ్ళాపుర నుంచి శిడ్లఘట్టకు సోమవారం చేరుకోవడంతో తాలూకా యంత్రాంగం ఘనస్వాగతం పలికింది. తహసీల్దార్ బిఎన్ స్వామి సహా ఎమ్మెల్యే బి.ఎన్ రవికుమార్, బీఈఓ నరేంద్రకుమార్, కమిషనర్ మంజునాథ్, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు కోడి రంగప్ప, తాలూకా అధ్యక్షుడు పటేల్ నారాయణస్వామి, తాజా మాజీ అధ్యక్షులు అనంతకృష్ణ, మంజునాథ్, రూపసి రమేశ్ వివిధ కన్నడసంఘాల ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులు కన్నడ జెండాతో ఊరేగుతూ కన్నడమాతకు జై అంటూ నినాదాలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాస్, టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌లు బందోబస్తు కల్పించారు. బస్టాండ్‌వరకు ఊరేగింపు సాగింది. కోటె సర్కిల్‌లో వేదిక కార్యక్రమం నిర్వహించారు.



తాలూకా యంత్రాంగం, వివిధసంఘాల సభ్యులు తదితరులు

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ నిరసన

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లపై అవినీతిపై ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతిపై సిట్, సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య బీజేపీ పాలనలో బోవి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని ఇటీవల ఆరోపించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అప్పట్లో సదరు కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించిన ప్రస్తుత ఉడుపి ఎంపీ కోట శ్రీనివాసపూజారి అభ్యంతరం తెలిపారు. తన పరిధిలో బోవి కార్పొరేషన్‌లో అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. సీఎం సిద్దరామయ్య తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో సీబీఐ విచారణకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా స్పందించకపోతే విధానసౌధలోని గాంధీ విగ్రహం వద్ద మౌనపోరాటం చేస్తానని ప్రకటించారు. చెప్పిన విధంగానే సోమవారం ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఎమ్మెల్యే సురేశ్ కుమార్, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, సభ్యులు రవికుమార్, ప్రతాప్ సింహ నాయక్, శాంతారాం బుడ్డి, భారతిశెట్టి నిరసనలో పాల్గొన్నారు.



నిరసన చేపట్టిన ఎంపీ, మద్దతుగా కూర్చున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

పరిహారం చెల్లింపులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రాయచూరు, జూలై 29 : గత ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితి వల్ల పంటనష్టానికి గురైన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కర్ణాటక రైతు సంఘం, హసిరుసేనల జిల్లా అధ్యక్షుడు నరసింహలు నాయక్ ఆరోపించారు. ఇప్పటి వరకు కేవలం కొద్దిమంది రైతులకు మాత్రమే పరిహారం అందించిన ప్రభుత్వం, మిగతా రైతుల గురించి పట్టించుకోకపోవడం అధికారుల వైఫల్యమే అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ పంప్‌సెట్ల కోసం తీసుకుంటున్న విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల ఖర్చును రైతులే భరించాలని విధించిన షరతును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో కొత్త ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి సాగు విస్తీర్ణం పెంచాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర నది నుంచి కాల్వలకు వెంటనే నీటిని విడుదల చేసి, అన్ని చెరువులను నింపాలని, తద్వార రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. గత ఏడాది పంటనష్టానికి గురై రైతులు అప్పుల పాలైన నేపథ్యంలో పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మరో నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ జాతీయ రహదారి పేరుతో రైతులను మరోసారి మోసగించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని ఆరోపించారు.

కేపీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే మంత్రి పదవికి రాజీనామా : రాజణ్ణ

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని అయితే కేపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని సహకారశాఖ మంత్రి రాజణ్ణ సంచలన ప్రకటన చేశారు. విధానసౌధలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాకు అధ్యక్ష పదవి దక్కినప్పుడు చూసుకుందామని దాటవేశారు. మంత్రి పదవికి రాజీనామాకు సిద్ధమన్నారు. మంగళవారం సీఎం, డీసీఎంలు ఢిల్లీ వెళ్తున్నారని అక్కడ అగ్రనేతలతో చర్చిస్తారన్నారు. ఎటువంటి పరిణామాలు ఉంటాయనేది తేలుతుందన్నారు. సిద్దరామయ్యకు చెడ్డపేరు తీసుకురావాలనే బీజేపీ, జేడీఎస్‌లు కుట్ర పన్నుతున్నాయన్నారు. అంతకుమించిన వాస్తవాలు లేవన్నారు. ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నామన్నారు. శాసనసభలో వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై ప్రతిపక్షనేత అశోక్ 3 గంటలసేపు మాట్లాడారన్నారు. దర్యాప్తు జరుగుతుండగానే వీరికి ఆత్రుత ఎందుకో అన్నారు. బీజేపీ, జేడీఎస్ పార్టీల నాయకులు కొత్తగా పెళ్లిచేసుకున్నవారి తరహాలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

అగ్రనేతలకు వారసులే ముఖ్యం

» మండిపడ్డ ప్రతాప్‌సింహ

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్ర రాజకీయ నేతలు వారసులకు రాజకీయంగా ఎదిగేలా చేయడమే ఆశయంగా మారిందని మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ అభిప్రాయపడ్డారు. సిద్దరామయ్య, యడియూరప్ప, మల్లికార్జున ఖర్గే, హెచ్‌డి కుమారస్వామిలదే ఇదే తీరు అన్నారు. బెంగళూరులో సోమవారం ఓ కార్యక్రమంలో ప్రతాప్‌సింహ మాట్లాడుతూ సిద్దరామయ్య, మహదేవప్ప, యడియరప్ప, దేవేగౌడలు ఎన్నో ఏళ్ల కష్టంతో ఎదిగి అత్యున్నత స్థితికి చేరుకున్నారన్నారు. కానీ వారు భవిష్యత్ తరాలకు ఏం సందేశం ఇవ్వ దలిచారని ప్రశ్నించారు. వారసులకు రాజకీయంగా పదవులు కట్టబెట్టారన్నారు. వీరు ఎదిగిన విధానానికి, వారసులు రాణిస్తున్నదానికి పొంతన ఉందా..? అని అన్నారు.

యువత, మహిళల్లో పెరుగుతున్న శ్వాసకోశ క్యాన్సర్

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలు, యువతలో శ్వాసకోశ కేన్సర్ పెరుగుతోందని ఇందుకు పలు కారణాలు ఉన్నాయని అప్రమత్తత లేకుంటే పెను ప్రమాదమని సంప్రద ఆసుపత్రి అంకాలజిస్ట్ రాధేశ్యామ్‌నాయక్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ శ్వాసకోశ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 80శాతం శ్వాసకోశ కేన్సర్ కేసులు ధూమపానం, పొగాకు ఉత్పత్తులతోనే వస్తున్నాయన్నారు. బాల్యంనుంచే ధూమపానం అలవాటు కొంతకాలం తర్వాత భిన్నమైన ఆరోగ్య సమస్యలకు కారణం కానుందన్నారు. ప్రతి లక్షమందిలో 5.6శాతం మందికి శ్వాసకోశ కేన్సర్ తలెత్తుతోందన్నారు. ప్రివెంటివ్ అంకాలజిస్ట్ వినోద్ కె రమణి మాట్లాడుతూ శ్వాసకోశ కేన్సర్ స్టేజ్ 3, 4 స్థాయిలోనే గుర్తింపు సాధ్యమవుతోందన్నారు. తొలి రెండు స్టేజ్‌లలో రోగాన్ని నిర్ధారించేవారు 20-30శాతం మంది మాత్రమే అన్నారు. డాక్టర్ అజయ్ జీవి పాల్గొన్నారు.

ఫెర్టిలిటీలో ఒయాసిస్ మైలురాయి

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్యం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు ఆధునిక చికిత్సలు దోహదపడుతున్నాయని ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆసుపత్రి డైరెక్టర్ దుర్గ జి రావ్ అభిప్రాయపడ్డారు. బనశంకరిలో సోమవారం 1500 మైలురాయికి చేరుకోవడంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐవిఎఫ్, టెసా, ఐసిఎస్ఐ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంతానసాఫల్యం కోసం వచ్చేవారికి ఆరోగ్య జాగ్రత్తలు సూచించి సదుపాయాలు కల్పిస్తున్నా మన్నారు. కన్సల్టెంట్ ప్రియాంక బజాజ్‌తోపాటు పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం



తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

హోసూరు(సిఫ్‌కాట్) జూలై 29: హోసూరు అసెంబ్లీ నియోజక వర్గంలో తారు రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. మాసినాయకనపల్లి పంచాయతీ యూనియన్ పరిధిలో మినిరల్స్, క్వారీస్ ప్రాజెక్టు కింద రూ.19.97 లక్షలతో పంచాక్షీపురం గ్రామం నుంచి సరస్సు వరకు తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ పాల్గొని భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తళి యూనియన్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, మాజీ యూనియన్ అధ్యక్షుడు సర్వేశ్, యూనియన్ కమిటీ సభ్యులు సంపత్‌కుమార్, సురేశ్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు సకుంతల శ్రీనివాసులు, కృష్ణప్ప, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.